క్లుప్తంగా

నాటుసారాతో జీవితం నాశనం



రేపల్లె: నాటుసారాతో జీవితం నాశనం అవుతుందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ దివాకర్ అన్నారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మండలంలోని గుడికాయలంక గ్రామంలో రేపల్లె కార్యాలయం ఆధ్వర్యంలో శనివారం కళాజాతతో అవగాహన కార్యక్రమం జరిగింది. ఇందులో ఆయన మాట్లాడారు. సారా కుటుంబాన్ని సైతం చిన్నాభిన్నం చేస్తుందని గుర్తుచేశారు. నాటుసారాకు ముడి సరుకులను విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా గ్రామంలో కళాజాత బృందం నాటుసారా దుష్ప్రభావాలను వివరించింది. ఎస్ఐ రాజశ్రీ , సిబ్బంది రవీంద్ర, హరినాయక్, శ్రీనివాస్, మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకావసరాల పిల్లల గుర్తింపునకు సర్వే



వేమూరు: ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించేందుకు సర్వే చేస్తున్నట్లు మండల విద్యాశాఖ–2 అధికారి జ్యోతి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయం ఆదేశాల మేరకు ఇలాంటి పిల్లలకు మెరుగైన విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. మండలంలో బడి ఈడు పిల్లలు ఎవరూ బయట ఉండకూడదని తెలిపారు. మే నెల 13 నుంచి జూన్ నెల 9వ తేదీ వరకు సర్వే కొనసాగుతుందని ఆమె శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేమూరు మండలంలోని బలిజేపల్లి గ్రామంలో సర్వే చేశారన్నారు. మండల కేంద్రాల్లో భవిత పాఠశాలలు ఉన్నాయని, అక్కడ చదివే పిల్లలకు ప్రభుత్వం స్టైఫండ్ అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో భవిత పాఠశాల ఉపాధ్యాయులు మోహనరావు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

తెనాలిలో భారీ వర్షం

విద్యుత్ సరఫరాకు అంతరాయం

తెనాలి: పట్టణ, పరిసరాల్లో శనివారం సాయంత్రం కొద్దిసేపు భారీ వర్షం కురిసింది. దీనికితోడు వీచిన గాలులతో వేసవి ఉక్కపోతకు ఉక్కిరిబిక్కిరైన ప్రజలకు వర్షంతో ఉపశమనం కలిగినా, విద్యుత్ అంతరాయంతో పరిస్థితి మొదటికొచ్చింది. బయట చల్లగా ఉన్నా ఇళ్లలో ఉక్కపోత, ఎంతకీ పునరుద్ధరించని విద్యుత్ సరఫరా కారణంగా జనం తీవ్ర అసహనానికి గురయ్యారు. సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో వర్షం చినుకులు మొదలుకాగానే విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పట్టణంలోని నందులపేట, నాజరుపేట, బుర్రిపాలెంరోడ్డు ఏరియాల్లో కరెంటు లేక అవస్థలు పడ్డారు. రాత్రి 9.30 గంటలక్కూడా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ జరగలేదు. కరెంటు ఎప్పటికి వస్తుందో తెలుసుకుందామని ఫోన్ చేసిన వినియోగదారులకు సంబంధిత అధికారులు అందుబాటులోకి రాకపోవటంతో ఏమీ పాలుపోని పరిస్థితి నెలకొంది. ఆయా ఏరియాల్లో ఎప్పుడు చినుకులు పడినా విద్యుత్ సరఫరా ఆగిపోవటం, పునరుద్ధరణకు తీవ్ర జాప్యం జరుగుతుండటంపై స్థానికులు విమర్శిస్తున్నారు. గతంలో ఎన్నడూ ఇలా జరగనేలేదని, ఇటీవలకాలంలోనే ఈ రకమైన అవస్థలు పడాల్సి వస్తోందని చెబుతున్నారు. దీనిపై విద్యుత్ ఏడీఐ అశోక్‌ను ఫోనులో సంప్రదించగా, పట్టణంలోని గోలిడొంక, సమీప గ్రామం చక్రాయపాలెంలో ఇన్సులేటర్లు దెబ్బతిన్న కారణంగా సరఫరా నిలిచిపోయిందని చెప్పారు. పునరుద్ధరణ ప్రయత్నాల్లో ఉన్నామని, మరో గంటన్నరకు సరఫరావస్తుందని సమాధానమిచ్చారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

- పలుచోట్ల ఘనంగా పండుగ నిర్వహణ
- ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన ముస్లింలు

రేపల్లె: త్యాగానికి, బలిదానానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను నియోజకవర్గంలో ముస్లింలు శనివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. రేపల్లె పట్టణం, మండలంలోని వివిధ గ్రామాలలో ఈద్గాలను తీర్చిదిద్దారు. ముస్లింలు పెద్దసంఖ్యలో చేరుకుని ప్రత్యేక నమాజ్ చేశారు. బక్రీద్ పర్వదిన విశిష్టతను ఇమామ్‌లు, మౌజన్లు వివరించారు. పండుగ రోజున ముస్లింలు ఖుర్బానీ విధిగా ఆచరించాలని, దీనిలో భాగంగా ఆహార పదార్థాలను పేదలకు, బంధువులకు అందించిన తరువాత తాము స్వీకరించాలన్నారు. సంపాదించిన దానిలో కొంత పేదలకు దానం చేయాలన్నారు. అప్పుడే ఆ అల్లాహ్ కృపకు పాత్రులు కాగలరని చెప్పారు.



వేమూరు: జంపని ఈద్గా వద్ద ప్రార్థనలో ముస్లింలు

చెరుకుపల్లి: మండలంలోని గుళ్ళపల్లి కనగాల, గూడవల్లి, మెట్టగౌడవారిపాలెం గ్రామాల్లోని ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పరస్పరం ఆలింగనం చేసుకుని ఈద్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. చెరుకుపల్లి ముస్లిం పెద్ద ఆదాం ఖాన్ మాట్లాడుతూ బక్రీద్ త్యాగాలకు ప్రతీక అని తెలిపారు. ప్రవక్త అడుగుజాడల్లో ప్రతి ముస్లిం నడవాలని కోరారు. కార్యక్రమంలో గుళ్ళపల్లి గ్రామ మసీద్ మూతవల్లి షేక్ కరిముల్లా, షేక్ జాన్‌సైదా, సయ్యద్ ఇమామ్, అక్బర్ బాషా పాల్గొన్నారు.

వేమూరు: జంపని గ్రామంలోని మసీదు నుంచి ఈద్గా వరకు ముస్లింలు శనివారం తరలివెళ్లారు. ఈద్గా వద్ద ప్రార్థనలు నిర్వహించారు. వేమూరులో ఈద్గా వద్ద కూడా ప్రార్థనలు జరిగాయి.

కొల్లూరు : కొల్లూరులోని మసీదు వద్ద నుంచి క్రాప రోడ్డులో ఉన్న ఈద్గా వద్దకు ప్రదర్శనగా ముస్లింలు చేరుకున్నారు. నమాజ్ కార్యక్రమం నిర్వహించారు. పరస్పరం బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

కర్లపాలెం: మండలంలోని పాత ఇస్లాంపేట, కొత్త ఇస్లాంపేట, నాగరాజుపాలెం, పేరలి, గణపవరం గ్రామాలలోని మసీదులు, ఈద్గాల వద్ద ముస్లింలు నమాజ్ చేశారు. పరస్పరం పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



కొల్లూరులో శుభాకాంక్షలు తెలుపుకొంటున్న చిన్నారులు



కర్లపాలెంలో.....



కొల్లూరు కేటీ కాలనీ మార్గంలో..

మాన్యువల్ కౌన్సెలింగ్‌తో బదిలీలకు డిమాండ్

చెరుకుపల్లి: గతంలో విద్యాశాఖ కార్యదర్శి ఇచ్చిన హామీ మేరకు ఎస్.జి.టి.లకు మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీ ప్రక్రియ నిర్వహించాలని యూటీఎఫ్ సీనియర్ నాయకుడు బాదావత్ సాంబయ్య నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వెబ్ ఆప్షన్ ఎనేబుల్ చేయటాన్ని ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక తరఫున ఖండించారు. ప్రభుత్వ పెద్దలు, విద్యాశాఖ ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల కోరిక మేరకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఐక్య వేదిక పిలుపు మేరకు 8వ తేదీన ఉమ్మడి గుంటూరు జిల్లా డీఈఓ కార్యాలయ ముట్టడికి అందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

వెబ్ కౌన్సెలింగ్‌పై నిరసన

కర్లపాలెం: ఎస్‌జీటీ ఉపాధ్యాయుల బదిలీలు మాన్యువల్ పద్ధతిలో కౌన్సెలింగ్ ద్వారా చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎస్‌జీటీ ఉపాధ్యాయుల బదిలీలు వెబ్ కౌన్సెలింగ్ ద్వారా చేయడం తగదన్నారు. ఈ మేరకు శనివారం వారు తమ నిరసన తెలియజేశారు. అనంతరం ఎంఈవో మనోరంజనికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

16న దేవస్థానం భూముల వేలం

చుండూరు(వేమూరు): చుండూరు మండలంలోని చినపరిమి గ్రామంలో గల శ్రీ రామలింగేశ్వర స్వామి, శ్రీ బసవేశ్వర స్వామి దేవస్థానాలకు సంబంధించి చినపరిమిలో గల భూముల లీజుకు బహిరంగ వేలం పాట నిర్వహించనున్నారు. ఈ నెల 16 వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు రామలింగేశ్వర స్వామి దేవస్థాన ప్రాంగణంలో గల మండపంలో వేలంపాట జరుగుతుందని ఈవో ఈమని అశోక్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఘనంగా సువర్ణ భారతి క్షేత్రం భూమిపూజ

తెనాలి: స్థానిక బుర్రిపాలెంరోడ్డులో వివేకానంద సెంట్రల్ స్కూలు దగ్గర నూతనంగా నిర్మించనున్న శ్రీసువర్ణ భారతీ క్షేత్రం (సరస్వతి దేవాలయం) భూమిపూజ శనివారం ఘనంగా నిర్వహించారు. పలువురు స్వామీజీల ఆధ్వర్యంలో వేదపండితులు విశేష హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు. పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామీజీ) మాట్లాడుతూ రాష్ట్రంలో తొలి సరస్వతి దేవాలయం లక్ష పలకలతో తెనాలిలో నిర్మించటం గొప్ప విషయమని చెప్పారు. సరస్వతి దేవి విశిష్టతను భక్తులకు తెలియజేశారు. పెద్దపులిపాక శ్రీవిజయ రాజరాజేశ్వరి శ్రీవిద్యాపీఠం పీఠాధిపతులు శ్రీవాసుదేవానందగిరి స్వామి భూమిపూజలో పాల్గొని విశేష ప్రవచనం చేశారు. విజయవాడలోని అష్టాక్షరి ఆశ్రమం నుండి శ్రీమన్నారాయణ అష్టాక్షరి సంపత్‌కుమార రామానుజ జీయర్‌స్వామి భక్తుల నుద్దేశించి మాట్లాడారు. ఇక్కడి గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠం, శ్రీసాలిగ్రామ మఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ నంబూరు వెంకట కృష్ణమూర్తి, కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం దంపతులు, టీటీడీ దాసస్వామి ప్రాజెక్టు కృష్ణ–గుంటూరు జిల్లా అధ్యక్షుడు గడ్డిపాటి శ్రీనివాసు (వాసు), కార్యదర్శి రావూరు సుబ్బారావు, సంయుక్త కార్యదర్శి ముద్దాభక్తుని రమణయ్య, గోపు రామకృష్ణ, రాజేశ్వరరావు, గొడవర్తి సాయి హరేరామ్ పాల్గొన్నారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.



భూమిపూజలో పాల్గొన్న స్వామీజీ

జూనియర్ ఇంటర్ సప్లిమెంటరీలో విద్యార్థుల ప్రతిభ

తెనాలి: ఇంటర్మీడియెట్ బోర్డు శనివారం ప్రకటించిన జూనియర్ ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో వివేక విద్యాసంస్థల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఉత్తమ మార్కులు సాధించినట్టు సంస్థల డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణరావు తెలియజేశారు. ఎంపీసీ గ్రూపులో పి.సుహానా, ఎన్ క్రిష్ణప్రియలు 467/470 మార్కులు సాధించగా, వేదవర్షిణి, ఎల్.లిఖిత, అష్రఫ్‌లు 465 మార్కులు సాధించినట్టు తెలిపారు. కొత్తపేటలోని వివేక పబ్లిక్ స్కూలులో సాయంత్రం జరిగిన అభినందన సభలో ఆయా విద్యార్థులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమ విద్యార్థులు జె.పవన్‌సాయి, జి.నిశాంత్‌కు 464 మార్కులు వచ్చాయన్నారు. మొత్తం 20 మంది విద్యార్థులు 460 మార్కులతో ప్రతిభను చాటటం గర్వకారణమన్నారు. బైపీసీ గ్రూపులో ఎస్‌కే మిస్బా 433/440 మార్కులతో విజయం సాధించినట్టు వివరించారు. ప్రతిభను చాటిన విద్యార్థులను స్వామీజీ భాస్కరానంద సరస్వతి అభినందించారు. సీఈవో ఉదయ్‌కిరణ్, ప్రిన్సిపాల్స్ జ్యోతి, శ్రావణి, డీన్ ఎస్.శ్రీనివాసరావు, పీడీ సునీల్, మురళి, రాంబాబు, ఠాగూర్, లావణ్య, రోజా, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.



ర్యాంకర్లతో భాస్కరానంద సరస్వతి, వీరనారాయణరావు తదితరులు

ఫిర్యాదులు రాకుండా చూసుకోండి

మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు

తెనాలిఅర్బన్: ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు పేర్కొన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో శనివారం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతి రోజు డోర్ టు డోర్ కలెక్షన్ జరగాలని సూచించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు ఉన్నారు.



చిన్నారుల్లో సృజనకు పదును

- ఉచిత వేసవి శిక్షణ శిబిరం
- కన్నెగంటి ఫౌండేషన్ నిర్వహణ

తెనాలి: వేసవి సెలవులు బడి చదువులకు విరామం... పిల్లలకు ఆటవిడుపు. సెలవుల్లో కేవలం ఆటలతోనే సరిపెట్టకుండా వారిలో సృజనను పెంపొందించే మార్గాలను అన్వేషిస్తుంటారు తల్లిదండ్రులు. ఏదొక అంశంలో శిక్షణను ఇప్పిస్తుంటారు. లలిత కళలపై ఆసక్తి కలిగిన పిల్లలు కూడా అటుకేసి చూస్తుంటారు. అలాంటి చిన్నారులకు పట్టణానికి చెందిన కన్నెగంటి రెడ్డమ్మ చౌదరి, అన్నపూర్ణదేవి ఫౌండేషన్ సహకారం అందిస్తోంది. తెలుగు, సంస్కృత భాషలు, కూచిపూడి నృత్యంతో సహా ఆరు అంశాల్లో ఏటా ఉచితంగా శిక్షణనిస్తోంది.

భారతీయ సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణ లక్ష్యంతో కన్నెగంటి రెడ్డమ్మ చౌదరి, అన్నపూర్ణదేవి ఫౌండేషన్ 2005లో ఆవిర్భవించింది. అప్పట్నుంచి కరోనా విపత్కర పరిస్థితులు మినహా ప్రతి వేసవి సెలవుల్లోనూ దాదాపు 45 రోజులపాటు ఉచిత వేసవి శిక్షణ తరగతులను నిర్వహిస్తోంది. స్థానిక హిందీ ప్రేమీమండలి వేదికగా నిర్వహిస్తూ వచ్చిన ఈ శిక్షణ శిబిరాన్ని ఈ వేసవి నుండి నాజరుపేటలోని శ్రీఅరవింద విద్యాకేంద్రానికి మార్చుచేశారు. ప్రతిరోజూ తెల్లవారుజామున 5.30 గంటల్నుంచి ఉదయం 11.30 గంటల వరకు కర్ణాటక సంగీతం, కూచిపూడి నృత్యం, యోగ, చిత్రలేఖనం, తెలుగు, సంస్కృతంలో శిక్షణనిస్తున్నారు. ఆయా అంశాల్లో ప్రముఖులైన ఉపాధ్యాయులతో శిక్షణను ఇప్పిస్తున్నారు. ఒక్కో చిన్నారి ఒకటికి రెండు మూడు అం శాల్లో శిక్షణ తీసుకుంటున్నారు.



డ్రాయింగ్ శిక్షణలో చిన్నారులు



డ్రాయింగ్, సంగీతం బ్యాచ్‌తో ఉపాధ్యాయులు

ఆరంభం నుంచీ ఇక్కడ వివిధ అంశాల్లో శిక్షణ తీసుకున్న విద్యార్థులు పాఠశాలల్లో, కాలేజీల్లో ప్రదర్శనలివ్వటం చేస్తున్నారు. బేసిక్స్ నేర్చుకున్న చిన్నారులు, తర్వాతి కాలంలో మరింతగా శిక్షణ తీసుకుంటూ రాణిస్తున్నారని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కన్నెగంటి రామరాయ చౌదరి వెల్లడించారు.

శిక్షణ శిబిరంలో స్థానికులే కాకుండా ఇతర ప్రాంతాల్లో ఉంటూ, సెలవులకు తాత, నానమ్మల ఇళ్లకు వచ్చిన చిన్నారులు కూడా ఇక్కడ వివిధ అంశాలను నేర్చుకోవటం విశేషం! వీటితోపాటు క్రమశిక్షణగా మెలగటం, తల్లిదండ్రులపై ప్రేమగా ఉండటం, పెద్దలను గౌరవించటం కూడా అలవరుస్తున్నారు.

రెండు అంశాలను నేర్చుకుంటున్నా



స్థానిక సెయింట్‌జాన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూలులో ఎనిమిదో తరగతి చదువుతున్నా. నాకు డ్రాయింగ్, సంగీతం అంటే ఇష్టం, ఫౌండేషన్ ఏటా నిర్వహిస్తున్న శిక్షణ శిబిరంలో గత రెండేళ్లుగా వీటిలో శిక్షణ తీసుకుంటున్నా. బేసిక్స్ వచ్చాయి. సొంతంగా బొమ్మలు వేయగలుతున్నా.

– గుంపెన దీప్తి, 8వ తరగతి

లలిత కళలంటే ఇష్టం



స్థానిక సెయింట్‌జాన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూలులో ఎనిమిదో తరగతి చదువుతున్నా. నాకు డ్రాయింగ్, సంగీతం అంటే ఇష్టం, ఫౌండేషన్ ఏటా నిర్వహిస్తున్న శిక్షణ శిబిరంలో గత రెండేళ్లుగా వీటిలో శిక్షణ తీసుకుంటున్నా. బేసిక్స్ వచ్చాయి. సొంతంగా బొమ్మలు వేయగలుతున్నా.

– మురికిపూడి శ్రీదేవి, 9వ తరగతి

శిక్షణ కోసం రోజూ తెనాలికి



మా ఊరు కొల్లిపర మండలం చక్రాయపాలెం. తూములూరులోని సరస్వతి శిశుమందిర్‌లో ఏడో తరగతి చదువుతున్నా. రెండేళ్లుగా ఫౌండేషన్ ఇస్తున్న వేసవి శిక్షణ తరగతుల్లో పాల్గొంటున్నా. గత సంవత్సరం డ్యాన్స్, డ్రాయింగ్, తెలుగు నేర్చుకున్నా. ఈసారి వాటితోపాటు సంస్కృతంలోనూ శిక్షణ తీసుకుంటున్నా.

– అమ్మిశెట్టి జయశ్రీ, 7వ తరగతి

సెలవులకని వచ్చి శిక్షణ



స్థానిక సెయింట్‌జాన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూలులో ఎనిమిదో తరగతి చదువుతున్నా. నాకు డ్రాయింగ్, సంగీతం అంటే ఇష్టం, ఫౌండేషన్ ఏటా నిర్వహిస్తున్న శిక్షణ శిబిరంలో గత రెండేళ్లుగా వీటిలో శిక్షణ తీసుకుంటున్నా. బేసిక్స్ వచ్చాయి. సొంతంగా బొమ్మలు వేయగలుతున్నా.

– వేజండ్ల విశాల్, 8వ తరగతి

ట్యూమర్‌లను అశ్రద్ధ చేస్తే ప్రాణాంతకం

- ఆధునిక ఆపరేషన్లతో ట్యూమర్లు తొలగింపు
- పిల్లల్లో, పెద్దవాళ్లలోనూ బ్రెయిన్‌ట్యూమర్‌లు
- వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డే నేడు

గుంటూరు మెడికల్: 'పల్నాడు జిల్లా రెంటచింతలకు చెందిన శ్రీనాథ్ ఏడాదిగా తలనొప్పి, చూపు మసకగా కనిపించం లాంటి లక్షణాలతో పలు ఆస్పత్రులు తిరిగినా ఆరోగ్య సమస్య పరిష్కారం కాలేదు. చివరకు గుంటూరులో న్యూరోసర్జరీ వైద్యులను సంప్రదించగా తలలో గడ్డ ఉందని(బ్రెయిన్‌ట్యూమర్) నిర్ధారించి ఆపరేషన్ చేసి తలలో ఉన్న గడ్డను తొలగించారు.

ఆధునిక జీవనశైలి వల్ల బ్రెయిన్ ట్యూమర్లు పెరిగిపోవటంపై వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బ్రెయిన్ ట్యూమర్‌లను సకాలంలో గుర్తించకపోవటంతో అవి ప్రాణాంతకంగా మారుతున్నాయి. ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి ఏడాది జూన్ 8న వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డేను నిర్వహిస్తున్నారు.

లక్షణాలు...

బ్రెయిన్‌లో సర్వసాధారణంగా సెల్స్ చనిపోయి కొత్తవి పుట్టుకొస్తుంటాయి. కొన్ని సమయాల్లో కణాలు చనిపోకుండానే కొత్తకణాలు పుట్టుకొచ్చి కొత్తగా వచ్చిన కణాలు ట్యూమర్‌గా(గడ్డ) మారతాయి. కొన్ని గడ్డలు క్యాన్సర్‌గా మారి ప్రాణాలు తీస్తాయి. కొన్ని గడ్డలు ప్రమాదకరమైనవి కావు. ఆపరేషన్ చేసి తొలగించవచ్చు. బ్రెయిన్ ట్యూమర్ ఉన్నవారిలో విపరీతమైన తలనొప్పి, వాంతులు అవ్వగానే తలనొప్పి తగ్గటం జరుగుతుంది. ఎక్కువగా ఉదయం వేళల్లో ఈ సమస్య కనిపిస్తుంది. మాట్లాడటం కష్టంగా ఉంటుంది. వినికిడి సమస్య, చూపు మసకబారటం, నడవటం కష్టంగా ఉండటం తదితర లక్షణాలు ఉంటాయి. బ్రెయిన్ ట్యూమర్ సైజును బట్టి, అది బ్రెయిన్‌లో ఏర్పడిన ప్రదేశం బట్టి, ట్యూమర్ రకాన్ని బట్టి లక్షణాలు ఒక్కో మనిషిలో ఒక్కో రకంలా కనిపిస్తాయి.

బ్రెయిన్ ట్యూమర్‌కు కారణాలు...

బ్రెయిన్ ట్యూమర్‌లు జన్యుపరలోపాల వలన, వంశపారంపర్యంగా వస్తాయి. బ్రెయిన్‌కు రేడియేషన్ సోకటం, సెల్‌ఫోన్ విపరీతంగా వాడటం వలన రేడియేషన్ సోకి మెదడులో గడ్డ వచ్చే అవకాశాలు చాలా మెండుగా ఉన్నాయి. పిల్లలు, పెద్దవారు అనే తేడా లేకుండా అన్ని వయస్సుల వారికి బ్రెయిన్ ట్యూమర్‌లు వస్తాయి.

జీజీహెచ్‌లో ఉచితంగా ఆపరేషన్లు...

గుంటూరు జీజీహెచ్ న్యూరోసర్జరీ వైద్య విభాగంలో అత్యాధునిక వైద్య పరికరాలతో బ్రెయిన్ ట్యూమర్ సర్జరీలను చేస్తున్నారు. ఆపరేషన్ చేసేందుకు నాలుగు గంటల నుండి ఎనిమిదిగంటల వరకు సమయం పడుతుంది. సుమారు మూడు లక్షల ఖరీదు చేసే ఆపరేషన్లు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా చేస్తున్నారు.



బాధితులకు చికిత్స ఇలా...

బ్రెయిన్ ట్యూమర్ సమస్యలతో బాధపడుతూ చికిత్స కోసం న్యూరోసర్జరీ వైద్య నిపుణులు, న్యూరాలజిస్టులను సంప్రదిస్తున్నారు. జిల్లాలో 20 మంది న్యూరోసర్జన్లు, 25 మంది న్యూరాలజిస్టులు ఉన్నారు. వారంలో ఇరువురు లేదా ముగ్గురు బ్రెయిన్ ట్యూమర్స్ సమస్యలతో వైద్యులను సంప్రదిస్తున్నారు. గుంటూరు జీజీహెచ్‌లో న్యూరోసర్జరీ వైద్య విభాగంలో ప్రతినెలా 20 మందికి బ్రెయిన్ ట్యూమర్ సర్జరీలు చేస్తున్నారు. న్యూరోసర్జరీ వైద్య విభాగంలో 2023లో 2,011 మంది, 2024లో 2,603 మంది, 2025 జనవరి నుంచి మే వరకు 2,626 మంది చికిత్స పొందారు. న్యూరాలజీ వైద్య విభాగంలో 2023లో 16,176 మంది, 2024లో 40, 381 మంది, 2025 జనవరి నుండి మే నెల వరకు 20,765 మంది వివిధ రకాల బ్రెయిన్ సంబంధిత సమస్యలతో చికిత్స పొందారు.

ఆధునిక సర్జరీలతో మెరుగైన జీవితం



బ్రెయిన్ సర్జరీలకు ఎండోస్కోపిక్ సర్జరీలు, కీహోల్ సర్జరీలు, నేవిగేషన్ గైడెడ్, మైక్రోస్కోపిక్ సర్జరీలు అందుబాటులో ఉన్నాయి. న్యూరోసర్జరీలో వచ్చిన ఆధునిక వైద్య పద్ధతులతో బ్రెయిన్ ట్యూమర్ ఆపరేషన్ చేయించుకున్న వారు గతంలో కంటే చాలా మెరుగైన జీవితాన్ని గడపవచ్చు. ఆధునిక వైద్యం ద్వారా నూటికి 95శాతం రోగికి మంచి జీవితాన్ని ప్రసాదించవచ్చు. బ్రెయిన్ ట్యూమర్స్‌లో నూటికి 10శాతం మాత్రమే ప్రాణాంతకమైనవి.

డాక్టర్ భవనం హనుమ శ్రీనివాసరెడ్డి, న్యూరోసర్జన్, గుంటూరు

ట్యూమర్‌లను ప్రాథమిక దశలోనే గర్తించవచ్చు...



న్యూరోసర్జరీలో వచ్చిన ఆధునిక వైద్య పద్ధతులతో నేడు బ్రెయిన్ ట్యూమర్‌లను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స అందించవచ్చు. ట్యూమర్‌లను నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ముప్పు. ప్రాథమిక దశలోనే తలలో గడ్డలను గుర్తిస్తే ఆపరేషన్లతో పనిలేకుండా మందులతో పూర్తిగా నయం చేయవచ్చు. అన్ని ట్యూమర్‌లకు ఆపరేషన్లు చేయాల్సిన పని లేదు. జనాభాలో ఒకశాతం మంది బ్రెయిన్ ట్యూమర్స్‌తో బాధపడుతున్నారు. ప్రజలకు బ్రెయిన్ ట్యూమర్స్‌పై అపోహలు చాలా ఉన్నాయి. అవగాహన చాలా తక్కువగా ఉంది.

–డాక్టర్ చిట్టెం లక్ష్మణరావు, న్యూరోసర్జన్, గుంటూరు

డాక్టర్ 'గద్దె'కు ఘన నివాళి



తెనాలిరూరల్: పట్టణానికి చెందిన గుండె వైద్య నిపుణుడు డాక్టర్ గద్దె శివనాగమల్లేశ్వరరావు శుక్రవారం మృతి చెందారు. ఆయనకు ఐఎంఏ తెనాలి శాఖ సభ్యులు ఘన నివాళులర్పించారు. స్థానిక బోస్‌రోడ్డులోని ఐఎంఏ కార్యాలయంలో శనివారం సాయంత్రం డాక్టర్ శివనాగమల్లేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ కె. అనిల్ కుమార్, డాక్టర్ మధు ప్రభాకర్ బాబు, డాక్టర్ పావని ప్రియాంక, డాక్టర్ కె. శ్యాం ప్రసాద్ , డాక్టర్ చందు సాంబశివుడు, డాక్టర్ కోటినాగయ్య, డాక్టర్ వేమూరి శేషగిరిరావు, డాక్టర్ నరసింహారావు తదితర వైద్యులు పాల్గొన్నారు.